ఒకమారు చదివేసిన పుస్తకాన్ని మళ్ళీ మళ్ళీ చదవవచ్చు. అదేపనిగా వాడిన యంత్రంమటుకు పాడయి మూలపడిపోతుంది. కాని ఆమె తనదగ్గరకు శుచిగా శుభ్రంగా వచ్చి తిరిగివెళ్లేటప్పుడు కూడా అలాగే చెక్కుచెదరకుండా వెడుతుంది.

ఆమె వెళ్ళిపోతోన్నప్పుడు ఆ దూరం మరింత దూరం అయినప్పుడు ఎంతో బరువుగా అనిపిస్తుంది.

* * *

ప్రసాద్ ఆలకిస్తూ కూర్చున్నాడు.

కింద తలుపులు తెరుచుకునేలోగా శబ్దం వినిపించింది.

క్రమంగా అడుగుల సవ్వడి పైకి వచ్చింది.

గట్టిగా భారంగా చప్పుడు.

బయట తలుపు మళ్లీ శబ్దం అయింది.

ఈమారు నాజూకుగా వుంది చప్పుడు.

అతని గుండె చప్పుళ్లుకూడా నాజూకుగా సుకుమారంగా రూపొందినాయి.

ఆమే! ఆమే! ఆదీ రంగుచీర!

తన గదివంపే నడిచివస్తోంది — అనుకుందుకు వీలుగా అడుగులచప్పుడు — విరామం ముడుచుకుపోతోంది.

కాని అతనికి ఆతురత.

నిజమేనా? లేక ఎవరయినా కుర్రవాడు తలుపుతోసి గడియవేయడం మరచి పోతే గాలికి అలా చప్పుళ్లు అవుతున్నాయా?

చిరాకుగా కుర్చీలోంచి లేచాడు.

జయ ఎందుకింత ఆలస్యంచేస్తోంది.

తనకోసం ఎదురుచూస్తూ వుంటానని ఎరుగదు గనుకనా? ఏదో రంగుచీర కట్టుకువస్తోంది.

ప్రసాద్‌కు అందరివంటి ఆడమనిషి కావాలి.

పెళ్లి, పిల్లలు, సంసారం యిలాంటి మామూలు విషయాలు మాట్లాడే మనిషి కావాలని అతని మనసు ఒకటే ఆరాట పడుతోంది. కాని రోజులో ఒక గంటో అరగంటో తప్ప తనతో మాట్లాడేందుకు సమయంలేక, సంగీతం వేదంతం తప్ప మరో విషయం తెలియక — గట్టిగా ఊపిరి పీలిస్తే అమడదూరం వెళ్ళిపోయే మనిషికాదు.

కాని తనతో తనకు కావలసిన జీవితం గడపవలసిన మనిషి వెళ్లిపోయింది.

